జి.కోడూరు సర్పంచ్ సస్పెన్షన్

మాకవరపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ కావడంతో మండలంలోని జి.కోడూరు సర్పంచ్ బొడ్డేటి అమ్మాజీ లక్ష్మిని(వైసీపీ మద్దతుదారు) మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. జి.కోడూరు పంచాయతీలో 14, 15వ ఆర్థిక సంఘాల నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మళ్ల జగన్నాథం ఇటీవల జిల్లా పంచాయతీ అధికారికి పిర్యాదు చేశారు. పనులు చేకుండానే ... మిగతా 8వ పేజీలో

త్రిశంకు స్వర్గంలో గోవాడ

షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు తరచూ అవాంతరాలు

- మూడు వారాల్లో ఎనిమిదిసార్లు ఆగిన క్రషింగ్
- పూర్తిస్థాయిలో జరగని ఓవర్‌హాలింగ్ పనులు, బగాస్ కొరత
- వరుస అంతరాయాలకు ఇవే ప్రధాన కారణాలు
- సాయంపై ప్రభుత్వం నుంచి లభించని భరోసా



క్రషింగ్ కోసం వచ్చి యార్డులో ఉండిపోయిన చెరకు ట్రాక్టర్లు

చోడవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి దయనీయంగా తయారైంది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ క్రషింగ్‌ను కొనసాగించడం జటిలంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుందని భావించినప్పటికీ ప్రస్తుత పరిస్థితులనుబట్టి చూస్తే ఈ ఏడాది క్రషింగ్ పూర్తయ్యే వరకు ఫ్యాక్టరీ పూర్తిగా నడుస్తుందా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది క్రషింగ్ సీజన్ దాదాపు నెల రోజులు ఆలస్యంగా ప్రారంభమైంది. గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలేదు. అయినప్పటికీ రైతులు సహనంతోపాటు ఫ్యాక్టరీ భవిష్యత్తుపై నమ్మకంతో



కేన్ క్యారియర్ వద్ద భారీగా ఉన్న చెరకు నిల్వలు

చెరకును సరఫరా చేస్తున్నారు. కానీ చెరకును క్రషింగ్ చేయడం యాజమాన్యానికి గగనంగా మారిపోయింది. ఓవర్‌హాలింగ్ పనులు పక్కాగా జరగకపోవడం, క్రషింగ్ పనులకు అవసరమైన నిధులు యాజమాన్యం వద్ద లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు అవసరమైన బగాస్ నిల్వలు సైతం లేకపోవడంతో అప్పులు చేసి ఊక కొనుగోలు చేసి ఫ్యాక్టరీని నడిపిస్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక ఇక్కట్లకు తోడు, యాజమాన్యం ముందుచూపులేని నిర్ణయాలు ఫ్యాక్టరీని గాలిలో దీపంలా తయారు చేశాయి. ఒకప్పుడు ఏటా ఐదు లక్షల టన్నులకు పైగా చెరకును క్రషింగ్ చేసిన గోవాడ ఫ్యాక్టరీ.. ఇప్పుడు లక్ష టన్నుల మాట అటుంచి కనీసం 10 వేల టన్నులు చెరకు ఆడడానికే ఆపసోపాలు పడేలా పరిస్థితి దిగజారిపోయింది. నెల రోజులకుపైబడి ఆలస్యంగా క్రషింగ్ ప్రారంభంకాగా.. మొదటి రోజు నుంచే అంతరాయాలు వెంటాతున్నాయి. ఏకబిగిన రెండు గంటలపాటు క్రషింగ్ సాగితే, సాంకేతిక సమస్యలతో 10 గంటలు ఆగిపోతున్నది. రెగ్యులర్ క్రషింగ్ మొదలై మూడు వారాలు కూడా కాలేదు. ఇప్పటికే ఎనిమిదిసార్లు క్రషింగ్ ఆగిపోయింది. దీంతో చెరకు బండ్లు, ట్రాక్టర్లు ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద రోజుల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకానొక దశలో సహనం నశించిన రైతులు.. ఎండీ నివాసం వద్ద ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఈ కారణాలతో ఫ్యాక్టరీలో ఇంతవరకు 23 వేల టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ జరిగింది.

రైతుల్లో తీవ్రఅసంతృప్తి

చెరకు నరికిన రైతుల పరిస్థితి ఇలా ఉంటే, పొలాల్లో చెరకు నరకని రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమకు కట్టింగ్ ఆర్డర్ వస్తుందా? రాదా? ఒకవేళ ఆర్డర్ వస్తే ఎప్పటికి వస్తుంది? అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. ఓవర్‌హాలింగ్ పనులను సక్రమంగా చేయకపోవడంతో క్రషింగ్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతున్నదని, దీనికితోడు బగాస్ కొరతతో పరిస్థితి మరింత దయనీయంగా తయారైందని రైతులు చెబుతున్నారు. క్రషింగ్ సక్రమంగా జరిగి ఉంటే ఫ్యాక్టరీలో ఉన్న బగాస్ నిల్వలు సరిపోయేవి. వరుస అవాంతరాలతో క్రషింగ్ పలుమార్లు ఆగిపోవంతో అందుబాటులో ఉన్న బగాస్ నిల్వలు త్వరగా తరిగిపోయాయని కార్మికులు అంటున్నారు. బగాస్‌ను బయటనుంచి తెచ్చి ఫ్యాక్టరీని నడిపించవలసిన అగత్యం ఏర్పడిందని అంటున్నారు.

కొరవడిన సహకారం

గోవాడ షుగర్స్‌కు ప్రభుత్వపరంగా సహకారం కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్యాక్టరీని మెరుగ్గా నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో నేతలు హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ నిర్వహణకు రూ.5 కోట్లతో పాటు, ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకుని వస్తామని చెప్పారు. కానీ నిధులు మంజూరు కాలేదు. క్రషింగ్ సీజన్‌కు ముందు రూ.5 కోట్లు కేటాయించి వుంటే ... మిగతా 8వ పేజీలో

సొంతింటి కల నెరవేర్చేలా సర్కార్ అడుగులు!

తొలిదశలో తొమ్మిది వేల పక్కా ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు

- వివిధ దశల్లో 6,121 ఇళ్ల నిర్మాణాలు
- ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం
- అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పం



అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ ఎల్లారమ్మ కాలనీలో పునాదుల స్థాయిలోనే వున్న పేదల ఇళ్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదల ఆశలు నెరవేరనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. తొలిదశలో తొమ్మిది వేల ఇళ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. వీటిలో ఆరు వేల పైచిలుకు ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో వున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు పేరుతో కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్టు గొప్పలకు పోయింది. లేఅవుట్‌ల ఏర్పాటుకు 2,464 ఎకరాలు సేకరించి/ సమీకరించి 704 కాలనీలను ఏర్పాటు చేశారు. భూముల సేకరణ జరిగిన ప్రాంతాల్లో వైసీపీ నాయకులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడారు. కొండలు, రాళ్ల రప్పలతో కూడిన భూములను ముందుగానే రైతుల నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేసి, అనంతరం అధిక ధరలకు ప్రభుత్వానికి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని పక్కనపెడితే.. గత ప్రభుత్వం పట్టణ పేదలకు



నిర్మాణాలు ప్రారంభం కాని రావికమతం మండలం దొండపూడి మత్స్యవానిపాలెం లేఅవుట్

ఒక సెంటు, గ్రామీణ పేదలకు సెంటున్నర చొప్పున లేఅవుట్లు వేసి పట్టాలు పంపిణీ చేసింది. అనంతరం పక్కా ఇళ్ల మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. కానీ పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు తమ స్థలాలు ఎక్కడ వున్నాయో చూపించలేదు. తమకు కేటాయించిన స్థలం ఎక్కడ వుందో చూపిస్తే.. ఇంటి నిర్మాణాన్ని దగ్గరుండి చూసుకుంటామని అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఇళ్ల నిర్మాణాలను సైతం అసంపూర్తిగా వదిలేశారు. ఇక రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేసిన దాఖలాలు లేవు. అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ ఎల్లారమ్మకాలనీ సర్వే నంబరు 283లో 85 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేసినట్టు పట్టాలు ఇచ్చారు. కానీ పది శాతం ఇళ్లు కూడా పూర్తి చేయలేదు. కొన్నిచోట్ల పనులు ప్రారంభించకపోగా మరికొన్నిచోట్ల ప్రారంభించిన పనులకు నిధులు లేక మధ్యలో వదిలేశారు. వైసీపీ హయంలో జిల్లాలో 704 లేఅవుట్‌లలో సుమారు 54 వేల ఇళ్లను నిర్మించాలని ప్రతిపాదించారు. వీటిల్లో 45 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల ఇళ్ల నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికను అమలు చేస్తున్న ... మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి

పది మంది నామినేషన్లు

- నేడు పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకూ గడువు
- 27న పోలింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం గడువు ముగిసే సమయానికి మొత్తం పది మంది నామినేషన్ వేశారు. చివరిరోజు ఇద్దరు (పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు) మూడు సెట్ల వంతున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలకు ఈ నెల మూడో తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం పది మంది అభ్యర్థులు..సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయగౌరి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులనాయుడు, పోతల దుర్గారావు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉంది. కాగా ఈ ఎన్నిక పార్టీ రహితంగా జరుగుతుంది. అందుకే బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించరు. బ్యాలెట్‌పై పేరు, ఫొటో మాత్రమే ఉంటాయి.

పంచాయతీ నిధులు దుర్వినియోగం

విచారణలో నిర్ధారించిన అధికారులు

గతంలో సామాజిక భవన నిర్మాణానికి చందాలు వేసుకున్న గ్రామస్థులు

- పిల్లర్ల వరకు పనులు పూర్తి
- అనంతరం ప్రభుత్వ నిధులతో మిగిలిన పనులు పూర్తి
- మొత్తం పనులన్నింటికీ కలిపి బిల్లు డ్రా చేసిన సర్పంచ్ భర్త
- గ్రామస్థుల ఫిర్యాదుతో అధికారులు విచారణ
- రూ.1,51,181లు రికవరీ చేయాలని లెక్కతేల్చిన అధికారులు
- ఈ నెలాఖరులోగా పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ఆదేశాలు



జమ్మదేవిపేటలో విచారణ జరుపుతున్న ఎంపీడీవో, అధికారులు

గొలుగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీలో శివారు జమ్మదేవిపేటలో రామాలయం ఎదుట సామాజిక భవన నిర్మాణం విషయంలో సర్పంచ్ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అందిన ఫిర్యాదుల మేరకు అధికారులు సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఎంపీడీవో మేరీరోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల పూర్త పీఆర్ జేఈ డిల్లీశ్వరితోపాటు పలుగ్రామాల కార్యదర్శులు.. జమ్మదేవిపేట గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సామాజిక భవనం పునాదులు, పిల్లర్లను గ్రామస్థులు విరాళాలుగా ఇచ్చిన సొమ్ముతో నిర్మించినట్టు ఈ సందర్భంగా పలువురు చెప్పారు. గత పంచాయతీ ఎన్నికల్లో తన భార్య మాకిరెడ్డి విజయలక్షిని ఏకగ్రీవంగా గెలిపిస్తే.. తమ సొంత నిధులతో సామాజిక భవనం మిగిలిన పనులు పూర్తిచేయిస్తానని మాకిరెడ్డి రామకృష్ణ అప్పట్లో పంచాయతీ ప్రజలకు హామీ ఇచ్చారని చెప్పారు. దీంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి ఎన్నికల్లో సర్పంచ్ పదవికి మరెవరూ పోటీ చేయలేదన్నారు. అనంతరం సామాజిక భవన నిర్మాణం పూర్తిచేసిన సర్పంచ్ భర్త రామకృష్ణ, అంతకుముందు నిర్మించిన పనులకు కూడా కలిపి బిల్లు డ్రా చేశారని ... మిగతా 6వ పేజీలో



ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద భక్తులు పుణ్యస్నానాలు చేసే సముద్రతీరం

మాఘ పౌర్ణమి జాతరకు పోదామా!

- నేడు పూడిమడక, రేవుపోలవరం సముద్ర తీరాల్లో తీర్థమహోత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- నేటి రాత్రంతా జాగారం
- రేపు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు
- భారీ ఎత్తున ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు

మాఘ పౌర్ణమి సందర్భంగా జిల్లాలో పూడిమడక, రేవుపోలవరం, ముత్యాలమ్మపాలెం, తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి తీర్థమహోత్సవాలు జరగనున్నాయి. భక్తులు రాత్రంతా జాగారం చేసి, తెల్లవారుజామున సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసు, మెరైన్, రెవెన్యూ అధికారులు పర్యటించి, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు పూడిమడక, రేవుపోలవరం సముద్ర తీరాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ... వివరాలు 8వ పేజీలో

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 114 మంది గైర్హాజరు

అనకాపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభయ్యాయి. తొలి రోజు ఉదయం జరిగిన పరీక్షకు 2,254 మందికిగాను 2,187 మంది హాజరయ్యారు. 67 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,687 మంది విద్యార్థులకుగాను 1,640 మంది హాజరయ్యారు. 47 మంది పరీక్షకు హాజరు కాలేదు. మొత్తం మీద తొలిరోజు 114 మంది ప్రయోగ పరీక్షలకు గైర్హాజరయ్యారు. కాగా జిల్లా వ్యాప్తంగా 88 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయని డీవీఈఓ సుజాత తెలిపారు.

రైతులకు విశిష్ట గుర్తింపు

- ఫార్మర్ రిజిస్ట్రీని ప్రారంభించిన కేంద్రం
- ఆధార్ తరహాలో 'భూ ఆధార్'
- 14 అంకెలతో కార్డులు జారీ
- పథకాలు, ప్రోత్సాహకాలు పొందేందుకు ఇదే కీలకం
- ఈ నెల 25లోగా ఆర్ఎస్‌కేల్లో నమోదు చేసుకోవాలి



రోలుగుంట రైతు సేవా కేంద్రంలో భూ ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది



రైతులకు జారీ చేసే నూతన భూ ఆధార్ కార్డు నమూనా

రోలుగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహా ప్రత్యేక కార్డులు జారీ చేస్తున్నది. ఇది వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ(భారత ప్రభుత్వం) సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్(యూసీ) కేటాయించేందుకు చర్యలు ప్రారంభించారు. మన రాష్ట్రంలో ఈ పోర్టల్ జనవరి 26వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తుంది. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పేర్లు నమోదు ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి నాటికి దేశ వ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మంది రైతులకు 'భూ ఆధార్' కార్డులు జారీ చేయాలని కేంద్ర ... మిగతా 8వ పేజీలో


తీరంలో అధికారులతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

సురక్షిత ప్రాంతాల్లో స్నానాలు ఆచరించాలి

- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

రాంబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాడపాలెం సముద్రతీరం వద్ద మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు సురక్షిత ప్రాంతాల్లో స్నానాలు ఆచరించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. తీరంలో ఈ నెల 12న జరగనున్న మాఘ పౌర్ణమి ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. పలు శాఖల అధికారులతో కలిసి సముద్ర తీరం వద్దకు వెళ్లి పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మాఘస్నానాలను ఆచరించేందుకు వచ్చే భక్తులు అధికారులు పలు సూచనలు చేయాలని, వారు సురక్షిత ప్రాంతంలో స్నానాలు ఆచరించేలా చూడాలని సూచించారు. ప్రమాదకర ప్రదేశాల్లో భక్తులు స్నానాలు ఆచరించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్డీ రాజు, రాంబిల్లి సీఐ నరసింగరావు, మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదు చేసుకోండి

- మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి


భూ ఆధార్ నమోదు ప్రక్రియను వివరిస్తున్న ఏవో

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో నమోదు జరుగుతోందని మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నకుమారి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నమోదు చేసుకున్న వారికి మాత్రమే భవిష్యత్తులో పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. భూమి ఉన్న రైతులు ఈ నెల 25వ తేదీలోగా సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి పట్టాదారు పాసు పుస్తకం, 1బి, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో లింక్ చేసిన ఫోన్ నంబర్‌తో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి

బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ సన్యాసినాయుడు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు సూచించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జేవీఎస్.రాజు, ఎ.హనుమంతరావు, జి.భక్తసాయిరాం, నాయుడుబాబు, ఎం.కాసుబాబు, బాషా, అనురాధ, సరేశ్ పాల్గొన్నారు.

చెత్త వేరుచేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించండి

- మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- వారంలో రెండు రోజులు పొడి చెత్త సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని వార్డుల్లో చెత్త వేరు చేసే కార్యక్రమాన్ని మునిసిపల్, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశించారు. సోమవారం ప్రజారోగ్య గ్యారేజ్ వద్ద చెత్త వేరు చేసే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటా తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు పొడి చెత్తను వారంలో బుధవారం, శనివారం మాత్రమే సేకరించాలని సూచించారు. తడి చెత్త సేకరణకు ప్రతీ రోజు పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లాలని స్పష్టం చేశారు. పొడి చెత్తను కాపులుప్పాడ వద్ద గ్యారేజ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎన్టీఆర్ కాలనీలో చేపట్టి మంచి ఫలితాలు సాధించినట్టు చెప్పారు. అలాగే అన్ని వార్డుల్లోనూ ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మునిసిపల్, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి పేర్కొన్నారు. మండలంలోని మునగపాక, చూచుకొండ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సోమవారం నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రవళిక మాట్లాడుతూ 19 ఏళ్ల పిల్లలకు మాత్రలు వేశామని, ఆరు నెలలకోకసారి ఇవి వేసుకోవడం ఆరోగ్యకరమని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి ఎస్.ఎస్తేర్‌రాణి, సీహెచ్‌వో దేవకాంత, పాఠశాలల హెచ్‌ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎలమంచిలి: జంపపాలెంలో మాత్రలు వేస్తున్న సిబ్బంది.. అచ్యుతాపురంలో మాత్రలు మింగిస్తున్న డాక్టర్ మానస

ఎలమంచిలిలో...

ఎలమంచిలి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని 3,159 మందికి ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు రేగుపాలెం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం: హరిపాలెం పీహెచ్‌సీ, ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహిస్తామని, సోమవారం మొదటి విడతలో 3264 మంది పిల్లలకు మందుల పంపిణీ చేశామని వైద్యాధికారి మానస తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సిబ్బంది శ్రీపాద రవి, ఎస్.శ్రీనివాస్, ఎ.రామలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అచ్యుతాపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం కొండకర్ల వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎవరు ఏ రంగాల్లో ఉన్నారో తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలపై ఆరా తీశారు. కాగా బ్యాచ్‌లో 117 మంది విద్యార్థులకుగాను, 20 మంది వివిధ కారణాల వల్ల మరణించారు. ఈ సందర్భంగా వారికి అంజలి ఘటించారు. ప్రతి ఏటా ఇలా కలుసుకొని కొంత నిధిని ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు మేరుగు బాపునాయుడు, పెద్దింటి ఈశ్వరరావు, ద్వారపురెడ్డి బుచ్చి అప్పారావు, రుత్తల గిరిబాబు, గుడాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో...

మునగపాక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1980-81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. మండలంలోని మూలపేట గ్రామంలో శ్రీగంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద వీరంతా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. వారితో కలసి చదువుకుని అనతి కాలంలోనే ఢిల్లీలో ఉద్యోగం సంపాదించుకుని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెంటకోట వెంకట శ్రీనివాసరావుకు వారంతా నివాళులు అర్పించారు. అలాగే ప్రతీ ఏటా ఫిబ్రవరి 10వ తేదీన కలుసుకోవాలని తీర్మానం చేసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అతని కుటుంబీకులుతో కొంత సేపు గడిపారు. ఈ కార్యక్రమంలో బీవీఎస్‌కే.విశ్వనాథం, బీమిశెట్టి అప్పారావు పాల్గొన్నారు.


మునగపాక: కొండకర్ల ఆవ వద్ద కలిసిన పూర్వ విద్యార్థులు

శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజోతి): మండలంలోని సంతబయల తంపరమూల ప్రాంతంలో శ్రీకృష్ణుడు ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ప్రదర్శించిన చిన్న పిల్లలు కోలాటం భక్తులను అలరించింది. గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెంటకోట విజయ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

బీజేపీ మండల యూత్ అధ్యక్షుడిగా చిరంజీవి


శీరా చిరంజీవి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ యూత్ మండల అధ్యక్షుడిగా శీరా చిరంజీవిని నియమించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నాయకులు అతన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం యువత బీజేపీపై మక్కువ చూపుతున్నారని, వారి ద్వారా గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చిరంజీవి పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, నాయకుడు కె.నాయుడుబాబు పాల్గొన్నారు.

అధిక లోడ్ వాహనానికి రూ.62 వేల జరిమానా

ఎలమంచిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అధిక లోడుతో ప్రయాణిస్తున్న ఓ వాహనాన్ని సోమవారం పట్టుకుని రూ.62 వేల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజోతి): మండలంలోని మడకపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఎస్.ఐ వై.ఎల్.నాయుడు తెలిపారు. మడకపాలెం సమీపంలో మద్యం విక్రయాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన జాజుల సూరిబాబు అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడని, ఆయన వద్ద 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. సూరిబాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం


భద్రావతి సమేత భావనారుషి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీహెచ్‌ఎల్‌పురంలో పద్మశాలీ మార్కండేయ సంక్షేమ సంఘం, భావనారుషి ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం భద్రావతి సమేత భావనారుషి వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిగింది. ఏటా శూలాల సంబరంలో భాగంగా తొలుత స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయ గురుస్వామి శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, సంఘ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జల్లూరులో టెక్నోపవర్ కంట్రోల్ ప్లాంటు ప్రారంభం

కోటవురట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లూరులో టెక్నోపవర్ కంట్రోల్ ప్లాంట్‌ను ప్రముఖ సినీ దర్శకుడు పరశురామ్, స్పీకర్ అయ్యన్న తనయుడు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సోమవారం ప్రారంభించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, టీకేపల్లి సర్పంచ్ పెట్ల లింగనాయుడు సౌజన్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నక్కపల్లి మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ సీనియర్ నాయకులు వేచలపు జనార్దన్, పి.సూర్యారావులతో పాటు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ సాగి సీతారామారాజు, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తదితరులు వేర్వేరుగా పాల్గొన్నారు.

'ధర్మనిధి సేకరణలో భక్తులు భాగస్వాములు కావాలి'

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామూహిక పూజలతో పాటు, ధర్మనిధి సేకరణలో కూడా భక్తులను భాగస్వాములు చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా ధర్మ ప్రచారక్ కలిగట్ల లలిత అన్నారు. మండలంలోని ఉద్దండపురంలో సోమవారం మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెలాఖరు వరకూ హిందూ బంధువులందరి నుంచి కనీస ధర్మనిధిని సేకరించాలని ఆమె సూచించారు. ఆదివారం సూర్యనమస్కారాలను ఆలయాలు కేంద్రంగా చేపట్టాలని తీర్మానించారు. నియోజకవర్గ ధర్మ ప్రచారక్ మైలపల్లి శ్రీను, మండల కన్వీనర్ శ్రీమంతుల సాంబ, గౌరవాధ్యక్షుడు డి.రాంబాబు, విజయ్, మండల మహిళా కన్వీనర్ కృష్ణకుమారి, కో-కన్వీనర్ వెదుళ్ల నాగలక్ష్మి, శివ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి ఆస్పత్రిలో సీ-ఆర్మ్ మిషన్ సౌకర్యం



నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి యాభై పడకల ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి మరో కొత్త పరికరం వచ్చింది. హోం మంత్రి అనిత చొరవతో వైద్య విధాన పరిషత్ సుమారు రూ. 20 లక్షలు విలువైన సీ-ఆర్మ్ పరికరాన్ని అందజేసింది. పలు రకాల ప్రమాదాల్లో గాయపడి, ఎముకలు దెబ్బతిన్న వారికి నేరుగా ఈ సీ-ఆర్మ్ మిషన్ ద్వారా సర్జరీ చేసే సదుపాయం నక్కపల్లి ఆస్పత్రికి కలిగింది. త్వరలో హోం మంత్రి అనిత దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- గతంతో పోలిస్తే ఆరు నెలల్లో 16 శాతానికి పైగా తగ్గిన క్రైమ్ రేటు
- ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడి
- మునగపాక పోలీస్ స్టేషన్ తనిఖీ

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గడచిన ఆరు నెలల్లో జిల్లా నేరాలు తగ్గాయని, అంతకు ముందుతో పోల్చితే పదహారు శాతానికిపైగా తగ్గు ముఖం పట్టాయని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య, భారీ వాహనాల రాకపోకలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పరిమితికి మించి సరకు రవాణా చేసే వాహనాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది అను నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్.ఐ పి.ప్రసాదరావు ఉన్నారు.


మునగపాక పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో ఎస్పీ తుహిన్ సిన్హా


పాయకరావుపేటలోని పాఠశాలలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న డాక్టర్ సౌందర్య

పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ


కోటవురట్ల మండలం చినబొడ్డేపల్లి పాఠశాలలో...

పాయకరావుపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలను సోమవారం విద్యార్థులకు వేశారు. కె.వెంకటాపురంలో నులిపురుగులు నివారణపై డాక్టర్ సంతోష్‌కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గోవిందరావు, హెచ్‌వీ ఆదిలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.

దిల్ రాజు ప్రొడక్షన్స్‌లో త్వరలో సినిమా

- ప్రముఖ దర్శకుడు పరశురామ్



కోటవురట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌లో దిల్ రాజు నిర్మాణ సారథ్యంలో తన దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని ప్రముఖ దర్శకుడు పరశురామ్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని జల్లూరులో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సినిమాకు సంబంధించి కథ పూర్తయ్యిందని, త్వరలో హీరో, హీరోయిన్, ఇతర నటీనటుల ఎంపిక మొదలవుతుందని వెల్లడించారు. తాను ఇప్పటి వరకు ఎనిమిది సినిమాలకు దర్శకత్వం వహించానని, దిల్ రాజుతో చేయబోయే సినిమా తొమ్మిదోది అవుతుందన్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్, జూలై నెలల్లో ప్రారంభించే అవకాశాలు వున్నట్టు పరశురామ్ చెప్పారు.

ఏకగ్రీవంగా మత్స్యకార సహకార సంఘ ఎన్నికలు


ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, డైరెక్టర్లు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాల్మన్‌పేటలో సోమవారం నిర్వహించిన శ్రీరామాంజనేయ మహిళా మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘంలో 195 మంది సభ్యులుండగా ఎన్నికకు 42 మంది హాజరయ్యారని, వీరంతా కలిసి ఏడుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారిణి టి.నాగమణి తెలిపారు. వీరిలో అధ్యక్షురాలిని, ఉపాధ్యక్షురాలిని ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షురాలిగా కందాల లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా గరికిన దొండెమ్మ, డైరెక్టర్లుగా గరికిన రాణి, ముత్తి నూకరత్నం, గోసల మంగ, గోసల సత్యవతి, గవల భారతి ఎన్నికయ్యారని చెప్పారు. ఎన్నికల సహాయ అధికారులుగా జె.పూర్ణిమ, వై.లహరి, సత్యనారాయణ వ్యవహరించారు. ఎన్నికైన కూటమి మద్దతుదారులను టీడీపీ నాయకులు మైలపల్లి అశోకచక్రవర్తి, శ్రీను, రమణ తదితరులు అభినందించారు.

ఉపమాకలో ఘనంగా దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవం


భజన చేస్తున్న మహిళా భక్త సమాజం ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉపమాకలో దుర్గాభవానీ ఆలయ పదో వార్షికోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ముందుగా అర్చకులు మహేశ్ అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో 24 గంటల ఏకాహం ప్రారంభించారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌ఎల్ పురంలో కోడిపందాల శిబిరంపై సోమవారం దాడి చేసినట్టు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఈ సందర్భంగా కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.1,250ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు ఇక్కడి వెలుగు కార్యాలయంలో సోమవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు మాట్లాడుతూ క్యాన్సర్ సోకిన తరువాత వైద్య సేవలు పొందడం కంటే ముందుగా వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నక్కపల్లి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష మాట్లాడుతూ ఎన్ని రకాలక్యాన్సర్లు, ఎలా సోకుతాయో వివరించారు. కేన్సర్ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఐసీటీఎస్ కౌన్సిలర్ రమణమ్మ పాల్గొన్నారు.

27 మద్యం బాటిళ్లు స్వాధీనం

నక్కపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వేంపాడు హైవే టోల్‌ప్లాజా సమీపంలోని ఓ షాపులో మద్యం అక్రమ అమ్మకాలు సాగుతున్నాయన్న సమాచారం మేరకు సోమవారం సాయంత్రం సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు తనిఖీలు నిర్వహించారు. 27 మద్యం సీసాలు స్వాధీనపర్చుకుని ఎ.రాము అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఉన్నత విద్యతో చక్కని భవిష్యత్తు : డీఈవో



కిట్లు అందుకున్న విద్యార్థినులతో డీఈవో అప్పారావునాయుడు

తుమ్మపాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యతో మెరుగైన జీవన ప్రమాణాలు సాధించవచ్చునని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. ఎలా చదవాలి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి తదితరాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించే అంశాలను వివరించారు. అనంతరం నాంది సంస్థ అందించిన కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : సీఐ



సచివాలయ పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల పరిధిలో ఎక్కడ ఏ సమస్య తలెత్తినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచించారు. ఇక్కడి పోలీస్ అతిథి గృహ సమావేశ మందిరంలో సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సచివాలయాల పోలీసులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. మీమీ ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మోసపోకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య, ఎస్ఐలు సత్యనారాయణ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బాబా సాహెబ్ అంబేడ్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ల ఆవిష్కరణలో పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబా సాహెబ్ అంబేడ్కర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సోమవారం ఆవిష్కరించారు. ముందుగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకుకట్ చేశారు. ఎస్.చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు బోని గణేశ్, ఎస్సీ ఎస్టీ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు రేబాక మధుబాబు, ఫైలపల్లి పోతురాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సులాభ్ కాంప్లెక్స్‌లో నీటి సరఫరాకు చర్యలు

లంకెలపాలెం, ఫిబ్రవరి 10 : ఇక్కడి జాతీయ రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద ఉన్న జీవీఎంసీ వాటర్ ఫ్రంట్ పార్కులో గల సులాభ్ కాంప్లెక్స్‌లో నీటి సరఫరాకు సోమవారం పనులు చేపట్టారు. పార్కు ప్రారంభమైనప్పటికీ సులాభ్ కాంప్లెక్స్‌కు నీటి సదుపాయం లేకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇది గుర్తించిన అధికారులు స్పందించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టి సులాభ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారు.

'ఈ- శ్రమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

తుమ్మపాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కరోనా విపత్కర పరిస్థితుల్లో వలస, అసంఘటితరంగ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కార్మికులకు భద్రత కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఈ- శ్రమ్ పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి అధికారి కె.వసంతరావు సోమవారం కోరారు. ఈ పథకానికి వ్యవసాయ రంగ కార్మికులు, ఆశ వర్కర్లు, వలస కార్మికులు, ఇళ్లు, దుకాణాల్లో పనిచేసే వారు, తోపుడుబండి వర్తకులు, మత్స్యకార కార్మికులు, పాల వ్యాపారస్తులు, చేతివృత్తిదారులు, భవన ఇతర రంగ కార్మికులు అర్హులన్నారు. ఈ- శ్రమ్ కార్డు కలిగిన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. రెండు లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ. రెండు లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష బీమా సదుపాయం పొందవచ్చునన్నారు. ఈ పథకాన్ని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

13న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సబ్బవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ నెల 13న జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి మండలంలో హెటెరో డ్రగ్స్ కంపెనీ, అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లోని యోకొహమా టైర్స్ కంపెనీలో 400 ఉద్యోగాలకు ఆయా సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి వున్న నిరుద్యోగ యువతీయువకులు బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. హెటెరో కంపెనీలో పనిచేసేందుకు (మేల్) ఎంఎస్సీ/ బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్/జనరల్, ఇంటర్ ఎంపీసీ/బైపీసీ, ఐటీఐ ఫిట్టర్ అర్హతల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలన్నారు. వార్షిక జీతం రూ.2.56 లక్షల నుంచి రూ.2.92 లక్షల వరకు వుంటుందన్నారు. యోకొహమా టైర్స్ కంపెనీలో పని చేసేందుకు (ఫిమేల్) డిప్లొమా/ఐటీఐ/ ఏదైనా డిగ్రీ అర్హులన్నారు. వార్షిక జీతం రూ.2 లక్షలు వుంటుందని, మరిన్ని వివరాల కోసం 81432 77610 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె సూచించారు.

పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు వినతి

పరవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించకపోవడం దారుణమన్నారు. ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీలలో పనిచేస్తున్న కార్మికులు ఏ అనారోగ్యానికి గురైనా, ప్రమాదాలు సంభవించినా విశాఖపట్నం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు అప్పలనాయుడు, పి.రమణ, డి. అప్పారావు, సన్యాసిరావు, అప్పారావు, తాతారావు పాల్గొన్నారు.

17న జిల్లాస్థాయి కోలాటం పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఈ నెల 17న జిల్లాస్థాయి కోలాటం పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనే కోలాటం బృందాలు తమ పేర్లను ఈ నెల 16 సాయంత్రం ఆరు గంటలలోపు ఉత్సవ కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90528 58028 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు ముత్యాలమ్మపాలెంలో జాతర

▸▸ ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ ▸▸ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు ▸▸ తీరంలో పుణ్యస్నానాలు రేపు

పరవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని ముత్యాలమ్మపాలెంలో మంగళవారం మాధవస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలకు తీర్థం ప్రారంభమవుతుంది. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి సముద్ర తీరంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. అనంతరం సమీపంలోని ఆలయంలో మాధవస్వామిని దర్శించుకొని పూజలు చేస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ స్టీల్ డిపో అధికారులు మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. స్థానిక డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. తీర్థానికి వచ్చే వారు వాహనాలను ముత్యమాంబ ఆలయం వద్దే నిలుపుదల చేయాలని ఆయన చెప్పారు.



భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్న ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం (అంతర్ చిత్రం) ఆయలంలో కొలువైన మాధవస్వామి

మాఘ పౌర్ణమి సముద్ర స్నానాలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీన జిల్లాలో ప్రజలు పుణ్యస్నానాలు చేసే ప్రదేశాలలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మాఘ పౌర్ణమి ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం మాఘ పౌర్ణమి పండుగ సందర్భంగా అచ్యుతాపురం మండలంలోని పూడిమడక, తంతడి గ్రామాలు, పరవాడ మండలంలోని తిక్కవాని పాలెం గ్రామం, ముత్యాలమ్మపాలెం, ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం, పాయకరావుపేట మండలంలోని పెంటకోటలలో పెద్ద సంఖ్యలో భక్తులు సముద్ర తీరాలలో పవిత్ర స్నానాలు చేస్తారన్నారు. భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, రవాణా, వైద్య సౌకర్యాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు స్నానం చేసేటప్పుడు సముద్రంలోకి లోతుగా వెళ్లకుండా సముద్రంలో దాదాపు దూరం వరకు స్తంభాలతో ఫిషింగ్ నెట్ బారికేడ్లను ఏర్పాటు చేయాలని, మహిళలు తడి బట్టలు మార్చుకోవడానికి తాత్కాలిక షెడ్లు, సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈతగాళ్లకు నియమించాలని వారికి గుర్తింపు జాకెట్లు/ డ్రెస్ కోడ్ అందించాలని, పార్కింగ్, ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరవుతున్నందున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమత్తతతో ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని, ప్రజలను అప్రమత్తం చేయడానికి సరైన ప్రకటనల కోసం పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, ఆరోగ్య శాఖ ద్వారా వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ సిబ్బందిని నియమించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేందుకు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, సమన్వయం కోసం బాధ్యులైన అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.

పిల్లలంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి : కలెక్టర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలందరూ వేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం దగ్గరుండి ఆమె నులిపురుగుల మాత్రలను వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సులోపు ఉన్న విద్యార్థులందరూ ఒక ఆల్బెండజోల్ మాత్రను వేసుకోవాలన్నారు. ఈ మాత్ర వలన ఏ రకమైన ఇబ్బందులు ఉండవని, ఒకవేళ ఏమైనా ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందు బాటులో ఉంటారని వివరించారు. విద్యారులు ఎవరైనా స్కూల్‌కు రాకపోతే వారికి మరలా ఈ నెల 17వ తేదీన మాత్రలు పంపిణీ చేయాన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా ఈ మాత్రలు పనిచేస్తాయన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్, జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ జె.ప్రశాంతి, డీఈవో అప్పారావునాయుడు, జోనల్ కమిషనర్ బీవీ రమణ, ఎంఈవో కోటేశ్వరరావు, హెచ్ఎం జి.బ్రహ్మాజీ పాల్గొన్నారు.



అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థికి మాత్ర వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కశింకోట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో 7125మంది విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను వేశామని వైద్యాధికారిణి డాక్టర్ ఎ.మనీషా తెలిపారు. తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆల్బండాజోలు మాత్రలు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి.సుబ్బారావు, తాళ్లపాలెం గురుకులం ప్రిన్సిపాల్ గ్రేస్, హెల్త్ అంబాసిడర్ బి.శ్రీదేవి, ఆరోగ్యకార్యకర్తలు, పాల్గొన్నారు.

సబ్బవరం : నులి పురుగుల మాత్రలను పంథొమ్మిది సంవత్సరాల లోపు వయస్సు గలవారంతా విధిగా వేసుకోవాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సూచించారు. కళాశాలలో జాతీయ నులి పురు గుల నివారణ దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నులి పురుగులు మాత్రలు వేసుకోవడం వలన రక్త హీనతతో పాటు పోషకాల గ్రహీత సామర్థ్యం పెరుగుతుందన్నారు. అధ్యాపకులు బి.లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేశ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ జి.రాం బాబు, ఎంఎల్‌హెచ్‌పీ కె.శాంతకుమారి పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో తొలగిన ఇక్కట్లు

▸▸ గవరపాలెంలో పలు చోట్ల ఎట్టకేలకు రహదారిపై కాంక్రీట్ పనులు

▸▸ ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయా ప్రాంతాల నివాసితులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో పైపులైన్ల నిర్మాణం కోసం జీవీఎంసీ అధికారులు తవ్వేసిన రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు ఏడాది క్రితం గవరపాలెంలోని సంతోషిమాత ఆలయం రోడ్డు, దిబ్బవీధి, జగన్నాథస్వామి ఆలయం వరకు పైపులైన్ల నిర్మాణంలో భాగంగా ఇరుకుగా ఉన్న రోడ్డులో కొంత భాగాన్ని అధికారులు తవ్వేశారు. నెలలు తరబడిన అక్కడ సిమెంట్ కాంక్రీట్ పనులు చేపట్టకపోవడంతో ఇరుకు రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు నిత్యం వాహనచోదకులు ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల 'ఇరుకు రోడ్డుపై ఇక్కట్లు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎట్టకేలకు తవ్వేసిన రోడ్డుపై సిమెంట్ కాంక్రీట్ పనులు చేపట్టారు. సుమారు నాలుగున్నర లక్షల రూపాయలతో రోడ్డు పనులు పూర్తి చేసినట్లు జీవీఎంసీ డీఈ గోపాలకృష్ణ తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దిబ్బవీధిలో కల్వర్టు మెరుగు (అంతర్ చిత్రం) గోతులు ఉన్నచోట్ల కాంక్రీట్ పనులు

బెల్ట్‌షాపులతో గీత కార్మికులకు ఉపాధి కరువు

▸▸ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి

▸▸ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేముడు



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న దేముడు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బెల్టుషాపులను అరికట్టి గీత కార్మికులకు న్యాయం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు కోరారు. సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఇక్కడ బత్తిన నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటైంది. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ జిల్లాలో మద్యం బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో కల్లుగీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులను అరికట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంటా శ్రీరామ్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు జి.రాము, ఎన్.తాతబాబు, బి.సతీష్, కె.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా తిరుగుతున్నా అర్జీలకు అతీగతీ లేదు

▸▸ సమృద్ధి వెంచర్ ప్లాట్ల కొనుగోలుదారులు ఆవేదన

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో అందజేసిన అర్జీలకు సంబంధిత అధికారులు సరిగా పరిష్కారం చూపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం అనకాపల్లి మండలంలోని గొలగాం పంచాయతీ పరిధి సమృద్ధి వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలుదారులు తమ గోడును వ్యక్తం చేశారు. 2012వ సంవత్సరంలో గొలగాంలోని సర్వే నంబరు 137/3లో వేసిన సమృద్ధి వెంచర్‌లో 104 మంది ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఎన్‌వోసీ కూడా ఇచ్చారన్నారు. కానీ 2018లో ఈ సర్వే నంబరును 22ఏ జాబితాలో పెట్టి క్రయ, విక్రయాలకు కుదరదని జీవో జారీ చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ సమస్య పరిష్కరించాలని కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో పలుమార్లు అర్జీలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని ప్లాట్లు కొనుగోలుదారులైన అప్పారావు, సూర్యారావు, మంగవేణి, అప్పలరాజు తదితరులు కోరారు.



కలెక్టరేట్ ఎదుట సమస్యను వివరిస్తున్న ప్లాట్ల కొనుగోలుదారులు

నేడు రెండు గ్రామాల్లో గంగాలమ్మతల్లి జాతర



తుమ్మపాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, మూలపేట గ్రామాల్లో మంగళవారం గంగాలమ్మతల్లి జాతర అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండేళ్లకొకసారి జరిగే ఈ వేడుకకు శారదా నదికి రెండు వైపులా ఆనుకొని ఉన్న గ్రామాలైన తుమ్మపాల, మూలపేట గ్రామాల్లో భారీ స్థాయిలో జరుగుతుంటాయి. తెల్లవారుజాము నుంచే ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తుంటారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్య క్రమాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా తొలేళ్ల ప్రదర్శన, గంగాలమ్మతల్లి రూపంలో ఉన్న అమ్మవారి ప్రదర్శన, మెడ గుర్రం ప్రదర్శన, ఏలి ఏనుగులు, గొర్రిపోతుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

వీరాంజనేయ ఆలయంలో కలశ ప్రతిష్ఠ



సబ్బవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చినవంగలిలో గల వీరాంజనేయ ఆలయంలో పసిడి కలశ సహిత యంత్ర ప్రతిష్ఠా మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అర్చకులు విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. అర్చకులు రవితేజ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గవరరాజు, పొట్నూరి అప్పారావు, ముదపాక శంకరరావు, గవర శ్రీను, జెట్టి హేమంత కుమార్, జెట్టి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు మళ్ల సురేంద్ర పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న సురేంద్ర దంపతులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూకాంబిక అమ్మవారిని సోమవారం గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయ ప్రతినిధులు స్వాగతం పలికి బాలాలయంలోని అమ్మవారి దర్శనాన్ని దగ్గరుండి జరిపించారు.


'స్వచ్ఛ అనకాపల్లి'పై విద్యార్థులకు పోటీలు



పోటీల్లో విజేతలతో జెడ్సీ రమణ తదితరులు

తుమ్మపాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయ భవనంలో సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ అనకాపల్లి అంశంపై డిబేట్ నిర్వహించారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు ఎన్.వర్మ, డి.శివరాము, జి.లక్ష్మీనారాయణ, గోపాలరావు, నిర్మల, ఓంరామ్, ఉమామహేశ్వరరావు, ఎస్.నూకరాజు, యేరుబండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు గ్లోబల్ స్కూల్ విద్యార్థి



తేజేశ్వరరావు అభినందనలో ప్రిన్సిపాల్, తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతాలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు స్థానిక సంస్కృతి గ్లోబల్ విద్యార్థి నల్లి తేజేశ్వరరావు ఎంపికయ్యాడు. గత నెల 22 నుంచి 25 వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థిని ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, విశాఖ జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణ రెడ్డి, శిక్షకులు గోవింద్ అభినందించారు.

మహిళ నుంచి మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం గోపాలపురం పంచాయతీలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. జెర్రిపోతుల సత్యవతి పదిక్వార్టర్ మద్యం బాటిళ్లతో పట్టుబడడంతో కేసు నమోదు చేశామన్నారు.

జేజిబాబు కుటుంబానికి 'దాడి' పరామర్శ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నేత, విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణశాఖ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు మృతికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సంతాపం తెలిపారు. సోమవారం పాత జగన్నాథ థియేటర్ సమీపంలోని నివాసం ఉంటున్న ఆయన నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రత్నాకర్, జయవీర్ సంతాపం తెలిపారు.


చిమిడిపల్లి వద్ద అంగన్‌వాడీ కేంద్రానికి మంచినీటి ట్యాంక్ ఏర్పాటు


నందకోటలో మరుగుదొడ్లు

అంగన్‌వాడీల్లో సమస్యల పరిష్కారం

- మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పన
- ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు
- తాగునీటి వసతికి రూ.17 వేలు
- తీరనున్న చిన్నారులు, గర్భిణుల కష్టాలు

అనంతగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన త రువాత అంగన్‌వాడీలకు మంచిరోజులు వచ్చాయి. ఇంతవరకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎ దుర్కొన్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు ఉన్నా రన్నింగ్ వాటర్ సదుపాయం లేక వాటిని ఉ పయోగించలేదు. దీంతో ఇవి శిథిలావస్థలకు చేరుకోవడంతో అత్యవసర సమయంలో ఆ రుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. మరుగుదొడ్ల, నిర్మాణంతోపాటు ఆయా కేంద్రాలకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు పనులు చేపడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ ఈ పనులను పర్యవేక్షిస్తోంది.

ఈ కేంద్రాల్లో అభివృద్ధి పనులు

అనంతగిరి సెక్టార్ పరిధిలోని తాటిగుడ, బగ్మారవలస, టోకూరు, లక్ష్మీపురం, అనంతగిరి-2, బొర్రా సెక్టార్ పరిధిలోని బొర్రా, కొనాపురం, కటికి, కర్రిగుడ, సింగర్భ, డెక్కాపురం, చిలకలగెడ్డ సెక్టార్ పరిధి: కొండిబ, చిలకలగెడ్డ, చీడివలస, శివలింగపురం, గంగవరం, తీగలమెట్ట, దబ్బపాడు, గుమ్మకోట సెక్టార్ పరిధిలో గొట్టిపాడు, గరుగుబిల్లి, గుమ్మకోట, కాశీపట్నం సెక్టార్ పరిధిలో వైఎస్సార్ పురం, నందకోట, సరియాపల్లి, చీమిడిపల్లి, గుమ్మనవలసలున్నాయి. అలాగే, లంగుపర్తి సెక్టార్ పరిధిలో లంగుపర్తి, నేలపాలెం, పెదకోట సెక్టార్ పరిధి: చటకంభ, పెదకోట, పైనంపాడు సెక్టార్ పరిధిలో వేంగడ, జీనబాడు, దిబ్బపాలెం, తముటు అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయం పనులు జరుగుతున్నాయి.. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి సరఫరాకు ట్యాంక్ ఏర్పాటుచేసి, కనెక్షన్ పనులకు రూ.17 వెచ్చించారు. వీటిలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో సదుపాయాలు అందుబాటులోకి వచ్చి రానుండడంతో కేం ద్రాల్లో మహిళలు, చిన్నారుల కష్టాలు తీరనున్నాయి.

ఆటో బోల్తా- 15 మందికి గాయాలు

కొయ్యూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) మండలంలోని బూదరాళ్ల పంచాయతీ ముకుడుపల్లి- చౌడిపల్లి గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలయ్యాయి. రాజేంద్రపాలెం వారపు సంతకు ముకుడుపల్లి గ్రామం నుంచి వచ్చిన వారు తిరిగి వెళ్తుండగా చీడిపల్లి దాటాక సిమెంట్ రోడ్డు ఎక్కుడు (గొప్ప)లో ఆటో అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బోనంగి రేఖమ్మ, కుర్తాడి రాజారావు, పాంగి నందిని, దార మనోజ్, కించే బాలమ్మ, పాంగి కామేశ్, గెమ్మెలి రామారావు, పాలిక రాధ, గణేసుల పెద్దబ్బాయి, గెమ్మెలి శాంతి, దేవి, తదితరులు గాయపడ్డారు. వీరిలో కించే బాలమ్మ చేయి విరిగింది. ప్రమాదం ను గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు 108 వాహన సిబ్బంది వచ్చి క్షతగాత్రులను రాజేంద్రపాలెం పీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన వైద్య సేవలకు 11 మందిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంప స్టేషన్ సిబ్బంది కేసు నమోదు చేసి క్షత గాత్రుల వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన వారి వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు


గుత్తులపుట్టులో బాలికకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జేసీ అభిషేక్‌గౌడ


విద్యార్థులకు నులుపురుగుల మాత్రలను వేస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

పిల్లల్లో నులి పురుగుల సమస్య తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ దినేశ్ కుమార్
- ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం

హుకుంపేట ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లోని చిన్నారులకు నులి పురుగుల సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ దినేశ్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థినులతో నులి పురుగు మందు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నులి పురుగు నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు 1-19 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలకు వేయిస్తున్నట్టు చెప్పారు. నులిపురుగుల వల్ల చిన్నారుల్లో బరువుతగ్గటం, పోషకాహర లోపం, కడుపు నొప్పి, విరేచనాలు తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. కలుషితమైన ఆహారంతోనే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. చిన్నారులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న 3లక్షల 35 వేల విద్యార్థులకు నులిపురుగుల మా త్రలు వేయాలన్నారు. మిగిలిన పిల్లలకు గుర్తించి ఆరోగ్య సిబ్బంది వారికి మా త్రలు మింగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డాక్టర్ ప్రతాప్,గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజిని, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరురూరల్: ఎన్ఎస్ఎస్, జువాలజీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం జాతీయ నులుపురుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టిబ్బాయి మాట్లాడుతూ జా తీయ నులుపురుగుల దినోత్సవాన్ని 2015లో ప్రారంభించారన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కళాశాల విద్యార్థులకు మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్.రసూల్, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, డాక్టర్.గణేష్, పి.సౌజన్య, ఎన్ఎస్ఎస్ పీవోలు జానకీరాం, గౌరీశంకరరావు, సీహెచ్.అచ్యుత్, జి.గోవిందరాజు, అధ్యాపకులు సునీత, వారిజ, రాధాకుమారి, లావణ్య పాల్గొన్నారు.విద్యార్థులు ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ ప్రతాప్ సూచించారు. మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాల్గొన్నారు. వైద్య సిబ్బంది జి.సింహాద్రి, వీవీవరలక్ష్మి, ఎం.సరోజిని, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, యు. చీడిపాలెం, కంఠారం, డౌనూరు పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు, సిబ్బంది, మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బహిరంగ మలమూత్ర విసర్జన నష్టాలు, గోర్లు పెంచుకోవటం వలన కలిగే అనర్థాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

ముంచంగిపుట్టు: కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, కాలేజీ, అంగన్‌వాడీ కేంద్రాలల్లో విద్యార్థులకు, పిల్లలకు నులిపురుగుల మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ శిరీష మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ నులిపురుగులు నివారణ మందును పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో క్రిష్ణమూర్తి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది కృష్ణవేణి, లలితమ్మ, మోహనరావు, నాగరాజు పాల్గొన్నారు.

అనంతగిరి: చిన్నపిల్లల్లో నులిపురుగుల నివారించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రూప్‌చంద్ అన్నారు. పినకోట, జీనబాడు పంచాయతీలోని పలు గ్రామాలకు సోమవారం వెళ్లి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు.

డుంబ్రిగుడ: స్థానిక బాలికల, బాలురు పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలోట వేశారు ప్రధానోపాధ్యాయిని సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారి భవాని, ఎంపీఈహెచ్‌వో శౌరి, స్వామి, ఏఎన్ఎంలు, ఆశ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను వేయించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, ఉపాధ్యాయుడు వీరభద్రరావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. ఈమందులు వేసుకోవడం వల్ల రక్తహీనతను నియంత్రించుకోవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీదేవి, వైద్యాధికారి అచ్యుత్ పాల్గొన్నారు.


కొయ్యూరు: మాత్రలు మింగిస్తున్న హెచ్ఎం, వైద్యాధికారి


కిలగాడలో విద్యార్థినికి మా త్రలు వేస్తున్న వైద్యాధికారి శిరీష

చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇందిరా ప్రియాంక


ఇందిరా ప్రియాంక

చింతపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరి యా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇందిరా ప్రియాంకను నియమిస్తూ విశాఖపట్నం జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల క్రితం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్. చంద్రశేఖరరావుని పరిపాలన లోపాలతో ఆయన్ని తొలగించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా చిన్నపిల్లల వైద్యనిపుణులు జి. ప్రభావతిని సెంకడరీ హెల్త్ జా యింట్ డైరెక్టర్ నియమించారు. సూపరింటెండెంట్‌గా నియమితులైన ప్రభావతి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండడంతో డీడీవో బాధ్యతలను తిరిగి చంద్రశేఖరరావుకి అప్పగించారు. ఈ నేపథ్యంలలో నూతన సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ శాఖ రికార్డులు డిజిటలైజ్: ఏఈఈ


మాట్లాడుతున్న ఏఈఈ ప్రభాకరరావు

చింతపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ రికార్డులు డిజిటలైజేషన్ చేస్తున్నామని స్థానిక ఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోనున్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మల వివరాలు తీసుకుని జియోట్యాగింగ్ చేస్తున్నామన్నారు. విద్యుత్‌శాఖ రికార్డులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు డిజిటలైజేషన్, జియోట్యాగింగ్ చేయడం వల్ల ప్రజలకు సులభరీతిలో సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్య తలెత్తిన వెంటనే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందని ఏఈఈ తెలిపారు.

పంచాయతీల్లో కందకాలు నిర్మాణం


మాట్లాడుతున్న ఏపీడీ సీతయ్య

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ప్రతి గ్రామంలో ఆదివాసీలకు ఉపాధి పనులు కల్పించాలని చింతపల్లి ఏపీడీ లాలం సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీకి 20 నీటి కందకాలు నిర్మించాలన్నారు. గోకులాల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పనులను గుర్తించి ప్రధాన్య క్రమంలో నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు బాలామృతం దోహదం


గడ్డికాలనీ పిల్లలకు బాలామృతం కిట్ అందిస్తున్న పీడీ సూర్యకుమారి

పాడేరురూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో మూడేళ్ల లోపు చిన్నారులందరికీ బాలామృతాన్ని ఆహారంగా అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి సూచించారు. గడ్డి కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం సందర్శించిన ఆమె 7 నెలలు నుంచి ఏడాది వరకు గల పిల్లలకు జూనియర్ (కొత్త) బాలామృతం, 1 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు సీనియర్ బాలామృతంను పిల్లల తల్లులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ బాలామృతంలో పంచదార, పాలపొడికి బదులుగా వేరుశనగపొడి, కొమ్ముశనగపొడి, వేయించిన గోధుమపిండి ఉంటాయన్నారు. ప్రతీ తల్లి 25 రోజులు పిల్లలకు బాలామృతాన్ని తినిపించి పెరుగుదలలో మార్పును గమనించాలని సూచించారు. అలాగే, గడ్డి కాలనీ, సుండ్రుపుట్టు, ఎంకేవీధి, జి.చాకలిపేట, పి.గొందూరు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలను వేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు


మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వందరోజులు ఉపాధి పని దినాలు కల్పించాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ ఆదేశించారు. సోమవారం ఉపాధి పథకం హామీ కార్యాలయంలోని క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులు కల్పించడంలోని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారంపండ్ పనులు, హౌసింగ్ 90 రోజులు పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఏపీడీ పవన్, ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు సహకరించాలి


బంద్‌కు సహకరించాలని కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న అఖిల పక్ష నేతలు


అరకులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాడేరురూరల్: ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సంఘ నాయకులు గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స కోరారు. ఈ చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఈనెల 11, 12వ తేదీలలో ఆదివాసీ అఖిల పక్ష ప్రజా సంఘాల వేదిక నిర్వహించే మన్యం బంద్‌కు సహకరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిపోయి సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చెప్పడం ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని కోరుతున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్.మాణిక్యం, కె.రాధాకృష్ణ, సీహెచ్.రాజుబాబు, వి.నాగేశ్వరరావు, కె.కాంతారావు, పి.జీవన్‌కృష్ణ, ఎల్.సుందరరావు, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ జేఏసీ ఈ నెల 12వ తేదీన చేపడుతున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సతకా బుల్లిబాబు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు, జీఎస్‌యూ రాష్ట్ర సమన్వయకర్త కిరసాని కిశోర్, ఆదివాసీ మహాసభ ప్రతినిధి బొంజునాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే మన్యం బంద్‌కు సహకరించాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు శతక బుల్లిబాబు, సుర్ల అప్పారావు, కె.కిశోర్, ఎం.బాబూజీ పాల్గొన్నారు.

అరకులోయ: అయ్యన్నపాత్రుడు 1/70 చట్టసవరణపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన సంఘాలు నిరసిస్తూ మంగళ, బుధవారాల్లో చేపడుతున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కిల్లో సురేంద్ర, పొద్దు బాలదేవ్‌లు పిలుపినిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రచార బైక్‌ర్యాలీని ప్రారంభించారు. అఖిలపక్ష నేతలు వైసీపీ నుంచి ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్ , కాంగ్రెస్ నేత పి.చిన్నస్వామి, సీపీఎం నేత కిండంగి రామారావు, సీఐటియూ నుంచి ఉమామహేశ్వరరావు, డీఎల్‌వో జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, గత్తుం బుజ్జిబాబు పాల్గొన్నారు.

చింతపల్లి: రెండు రోజుల మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి బంద్ జయప్రదం చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, గిరిజన సంఘం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, సీపీఐ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, మేధావుల ఫోరం జిల్లా నాయకుడు తాంగుల జగత్‌రాయ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకు సంతబయలు, కించుమండలో ప్రచారం నిర్వహించారు. డుంబ్రిగుడలో కళాశాల విద్యార్థులు ర్యాలీని చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక వారపు సంతలోని జడ్పీటీసీ గంగరాజు ఆధ్వర్యంలోని మన్యం బంద్‌పై విస్తృతంగా ప్రచారం చేశారు. టోకూరు సర్పంచ్ మోస్య, సీపీఎం నాయకులు నాగులు, బుద్రయ్య, సింగులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: భూబదలాయింపు చట్టంపై వైసీపీ నాయకులు మాట్లాడే కనీస అర్హతలేదని టీడీపీ సీనియర్ నేత, దేవరాపల్లి సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సమస్యను అధిష్ఠానం దృష్టికి తీసుకొని వెళ్లామన్నారు.


డుంబ్రిగుడలో మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు

బంద్‌లో ఎన్నికల కోడ్‌ను పాటించాలి: ఎస్ఐ


హుకుంపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీశ్

చింతపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల మన్యం బంద్‌లో ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఎన్నికల కోడ్ (ఎంసీసీ)ని విధిగా పాటించాలని స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బంద్ నేపథ్యంలో వర్తకులు దుకాణాలను మూసివేయాల్సిన అవసరంలేదన్నారు. ప్రజారవాణా ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు సర్వీసు వాహనాలు ఏ ఆటంకంలేకుండా నడుపుకోవచ్చన్నారు. ఎవరూ ట్రాఫిక్ రద్దీకి ఎక్కడా అంతరాయం కలిగించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా తిరిగరాదన్నారు. ప్రభుత్వ నియమాలను అమలుకు బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమలులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు.

హుకుంపేట: మన్యం బంద్‌కు సహకరించవద్దని ప్రజలకు స్థానిక ఎస్ సతీశ్ ప్రజలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మన్యం బంద్‌లో నిబంధనలు తూచా తప్పకపాటించాల్సి ఉందన్నారు. ఈమేరకు హుకుంపేట, కడిగిరి గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలిసి ప్రచారం చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రీ పథకంతో రైతులకు పథకాలు చేరువ


ఏవో ఉమాదేవి

కొయ్యూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ రైతు, రైతు బినామీలను అరికట్టేందుకు వీలుగా ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ పథకాన్ని సద్వినియోగ పరుచుకోవాలని మం డల వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అసలైన రైతులకు లబ్ధి జరగటం లేదని, దీనికి నకిలీ రైతులు, రైతు బినామీలే కారణమన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలని ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ రైతుకు ఒక విశిష్ట సంఖ్యతో వారి వివరాలు నమోదు చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇది పూర్తయితే సంబంధిత రైతులకు పంటల బీమా, సుఖీభవ, పీఎం కిసాన్ తదితర పథకాలు, పంట రుణాలు సులభంగా పొందేందుకు వీలవుతుందన్నారు. పట్టా భూమి కలిగిన ప్రతీ రైతు వారి ఆధార్ నంబరు, మొబైల్ తీసుకుని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

79 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు


తనిఖీ వైద్యాధికారి హిమబిందు

సీలేరు, ఫిబ్రవరి 10 , (ఆంధ్రజ్యోతి) : జీకవీధి మండలం ధారకొండ పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్యాధికారి డీకే హిమబిందు వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని 79 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, ప్రసవ సమయానికి 10 రోజులు ముందు ఆసుపత్రిలో చేరాలన్నారు. గర్భిణుల గృహంలో ప్రసవం వల్ల తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు 9 నెలల్లో ఒకసారి అయినా చింతపల్లి ఏరియా ఆసుపత్రికి వెళ్లి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. అక్కడి గర్భిణుల వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోవిద్యార్థులకు నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది పి పోతురాజు, జి. మూర్తి తదితరులు పాల్గొన్నారు.



డీఎంకు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న డీపీటీవో పద్మావతి

ఆర్టీసీ ప్రమాదాలు తగ్గుముఖం

» జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కె.పద్మావతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆర్టీసీ ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కె.పద్మావతి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా స్థాయిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఏడాది 0.6 శాతం ప్రమాదాలు నమోదైతే, ఈ ఏడాది 0.5 శాతానికి తగ్గాయని చెప్పారు. పాత బస్సుల స్థానంలో నర్సీపట్నం డిపోకి ఆరు, అనకాపల్లి డిపోకు మూడు కొత్త బస్సులు వచ్చాయని ఆమె తెలిపారు. మాఘ పౌర్ణమి సముద్ర స్నానానికి వెళ్లే భక్తులు కోసం మంగళ, బుధ వారాలలో నర్సీపట్నం డిపో నుంచి రేవుపోలవరం 45, అనకాపల్లి నుంచి పూడిమడక 50, ఎస్.కోట దగ్గర పుణ్యగిరికి ఐదు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. శివరాత్రి సందర్భంగా అనకాపల్లి నుంచి కళ్యాణపులోవ 35, నర్సీపట్నం నుంచి 50, గొలుగొండ మండలం దారమటానికి 15 బస్సులు నడుపుతున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పొగమంచు కమ్మేసింది..



మాడుగులలో దట్టంగా కురుస్తున్న మంచు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పొగ మంచు దట్టంగా కమ్ముకుంటున్నది. వేకువజామున మంచు తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. దీంతో ఏజెన్సీ వాతావరణాన్ని తలపిస్తోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. ఓ వైపు పొగమంచు కమ్ముకుంటుంటే, మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. విభిన్న వాతావరణానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వేసవి రాక ముందే ఎండ సుర్రుమంటున్నదని వేకువజామున, రాత్రి సమయాల్లో పొగమంచు కమ్ముకుంటున్నదని, దీంతో జీడి మామిడి పూతకు నష్టం కలుగుతుందని రైతులు చెబుతున్నారు.

విద్యా సంస్థల్లో డీ వార్మింగ్ డే



కొత్తూరు హైస్కూల్‌లో డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

చోడవరం/రావికమతం/గొలుగొండ/మాకవరపాలెం/దేవరాపల్లి/కె.కోటపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో సోమవారం డీవార్మింగ్ డే నిర్వహించారు. చోడవరంలోని కొత్తూరు బాలికల హైస్కూల్‌లో సోమవారం ఎండీవో పీవీ ఆంజనేయులు వార్మింగ్ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మహేష్, ఎంఈవోలు తిరుపతిరావు, సింహాచలం, హెచ్ఎం రామిరెడ్డి, వైద్యాధికారులు భారతి, సత్య, దీపిక, ప్రదీప్ పాల్గొన్నారు.

రావికమతంలోని కొత్తకోట జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్తకోట పిహెచ్‌సీ వైద్యాధికారి రజినీ విద్యార్థులతో దగ్గరుండి నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.రామారావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గొలుగొండ మండలంలోని పాఠశా



గొలుగొండ గురకుల కళాశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్యామ్

లల్లో వైద్యులు శ్యామ్‌కుమార్, మధుసూదన్, ధనుంజయ్ ఆధ్వర్యంలో నులుపురుగుల మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం పట్ల చేపట్టాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. మాకవరపాలెం మండలంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం అల్బెండజోల్ మాత్రలు ఎంతోగానో ఉపయోగపడతాయని ఎంఈవో మూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల



దేవరాపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీవో

నివారణ మాత్రలు మింగించారు. ఏడాదికి రెండు సార్లు ఆల్బెండోజోల్ మాత్రలు విధిగా వేసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సువర్ణరాజు సూచించారు. అలాగే చేతులు పరిశుభ్రంగా కడగడం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పూజిత, మేఘన, ఎంఈవోలు పడాల్‌దాస్, పుష్పరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కె.కోటపాడు మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవో-1, 2, కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాఠశాలల్లో విద్యార్థులకు దగ్గరుండి మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ పాల్గొన్నారు.



కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థికి మాత్ర వేస్తున్న దృశ్యం

శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా చదివించండి

» టెన్త్ విద్యార్థులు రాత్రి 10 గంటల వరకూ తప్పక చదవాల్సిందే

» జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు

» వసతిగృహాల్లో రాత్రి వేళ ఆకస్మిక తనిఖీలు

చీడికాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యార్థులను చదివించాలని జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు వసతిగృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. మండలంలోని తురువోలు బీసీ బాలుర వసతిగృహాన్ని ఆదివారం రాత్రి 9.45 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఆ సమయంలో నిద్రిస్తున్నారు. వెంటనే హాస్టల్ సిబ్బందిని ఈ విషయమై ఆరాతీయగా, ఇక్కడ ఇన్‌చార్జి వార్డెన్‌గా శ్రీరామ్మూర్తి పనిచేస్తున్నారని సమాధానమిచ్చారు. విద్యార్థులు నిద్రిస్తున్న విషయాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి దృష్టికి డీఈవో తీసుకువెళ్లారు. సోమవారం నుంచి శనివారం వరకూ రాత్రి 10 గంటల వరకూ విద్యార్థులు చదువుతారని, ఆదివారం పగలు ఎక్కువగా చదవడం వల్ల రాత్రి 9 గంటల తర్వాత విశ్రాంతి తీసుకొంటారని ఆమె సమాదానం చెప్పారు. దీనికి డీఈవో స్పందిస్తూ ఆది, సోమవారం అనేది లేకుండా పది పరీక్షలు పూర్తయ్యేవరకూ విద్యార్థులను చదివించాలని ఆదేశించారు. ఈ ఏడాది విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యాన్ని అందరూ తీసుకోవాలని ఆయన చెప్పారు.

తెనుగుపూడి గురుకుల పాఠశాలలో డీఈవో తనిఖీలు

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ విద్యాలయం, బీసీ బాలుర హాస్టల్‌ను జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు తర్ఫీదు పొందడంపై ఆరా తీశారు. రాత్రి పూట విద్యార్థులు చదువుతున్నదీ? లేనిది? ఇళ్లకు వెళ్లి డీఈవో తనిఖీలు చేశారు. రాత్రిపూట పదో తరగతి విద్యార్థులు చదువుతున్నది? లేనిది? మండల విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు వెళ్లి పరిశీలిస్తున్నారని ఈ సందర్భంగా డీఈవో చెప్పారు. జిల్లాలో ఆరు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాలను అమర్చి పరీక్షలు జరుపుతామని ఆయన తెలిపారు.



తురువోలు హాస్టల్‌లో రాత్రి సమయంలో తనిఖీలు చేస్తున్న డీఈవో

పల్లావూరులో నీటి ట్యాంకు రహదారిపై వివాదం

» తూర్పు వైపు ఇచ్చేందుకు అంగీకారం...

పడమర వైపు ఇవ్వాలని డిమాండ్



పల్లావూరులో రహదారి సమస్యపై గూమిగూడిన గ్రామస్థులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సీహెచ్.నాగాపురం పంచాయతీ పాతపల్లావూరు గ్రామంలో ఏళ్ల తరబడి ఉన్న మంచినీటి ట్యాంక్‌కు వెళ్లే రహదారి కోసం సోమవారం గ్రామస్థుల మధ్య వివాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పల్లా చిన్న జిరాయితీ ఇంటి స్థలానికి అనుకొని ఉన్న మంనీటి పథకం ట్యాంక్‌కు రహదారి లేదు. దీంతో సదపు స్థల యాజమానిని గ్రామస్థులంతా ట్యాంకుకు రహదారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ యలమంచిలి రఘురామ్‌చంద్రరావు, ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, సేనాపతి వరహాలబాబు తదితర గ్రామ పెద్దల సమక్షంలో ట్యాంకు రహదారిపై చర్చించారు. స్థల యాజమాని పల్లా చిన్న తన స్థలానికి తూర్పు వైపు మూడు అడుగుల మేరకు రహదారికి స్థలం ఇచ్చేందుకు అంగీకరించారు. అయితే గ్రామస్థులు కొత్తగా నిర్మిస్తున్న రామాలయం పడమర వైపు ప్రాంతాన్ని అనుకొని ఉన్న స్థలాన్ని రహదారికి ఇవ్వాలని కోరడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో కృష్ణాదేవిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యపై చర్చించారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి ఈ సమస్య పరిష్కరించుకోవాలని వారు సూచించారు. దీంతో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులంతా తహసీల్దార్ కె.శ్రీనివాసరావుకు ఈ సమస్యపై ఫిర్యాదు చేశారు.

అధిక విద్యుత్ బిల్లు వచ్చిన ఇళ్ల పరిశీలన

రావికమతం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రూ.వేలల్లో కరెంట్ బిల్లు వచ్చిన డోలవానిపాలెం గ్రామానికి చెందిన డోలా లక్ష్మి కుమారుడు సత్తిబాబు, గాది కొండమ్మ ఇళ్లకు ఏపీఈపీడీసీఎల్ రావికమతం ఏఈ నందన్ సోమవారం వెళ్లారు. అధిక విద్యుత్ బిల్లు వచ్చిన వైనంపై 'గిరిజనుల గుండె గుబిల్లు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితంకావడంతో ఏఈ వారి ఇళ్లకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో డోలా లక్ష్మి(సత్తిబాబు) ఇంట్లో రెండు బల్బులు, ఒక టీవీ మాత్రమే వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ఆ ఇంటికి రూ.1.6 లక్షలు బిల్లు సాంకేతిక లోపం వల్ల వచ్చిందని నిర్ధారించారు. ఈ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆందోళన చెందవద్దని లక్ష్మికి ఆయన భరోసా ఇచ్చారు. అలాగే గాది కొండమ్మకు రూ.29,913ల బిల్లు రావడం వాస్తవమని, ఈ బిల్లును కొండమ్మ చెల్లించాలన్నారు. ఆమె ప్రభుత్వం ఇచ్చిన పరిమితికి మించి విద్యుత్ వినియోగిస్తున్నందున వెంటనే బిల్లు చెల్లించాలని సూచించామని ఏఈ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 13న జాబ్ మేళా

నర్సీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ నెల 13న జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి మండలంలో హెటెరో డ్రగ్స్ కంపెనీ, అచ్యుతాపురం ఎస్ఈజడ్‌లోని యోకొహమా టైర్స్ కంపెనీలో 400 ఉద్యోగాలకు ఆయా సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి వున్న నిరుద్యోగ యువతీ యువకులు బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. హెటెరో కంపెనీలో పనిచేసేందుకు (మేల్) ఎంఎస్సీ/ బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్/జనరల్, ఇంటర్ ఎంపీసీ/బైపీసీ, ఐటీఐ ఫిట్టర్ అర్హతల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలన్నారు. వార్షిక జీతం రూ.2.56 లక్షల నుంచి రూ.2.92 లక్షల వరకు వుంటుందన్నారు. యోకొహమా టైర్స్ కంపెనీలో పని చేసేందుకు (ఫిమేల్) డిప్లొమా/ఐటీఐ/ ఏదైనా డిగ్రీ అర్హులన్నారు. వార్షిక జీతం రూ.2 లక్షలు వుంటుందని, మరిన్ని వివరాల కోసం 81432 77610 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె సూచించారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

నర్సీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్.కృష్ణ సూచించారు. జిల్లా స్టెప్ కార్యాలయం, ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన సమయాన్ని విద్యార్థులు వృథా చేసుకోకూడదన్నారు. వైఫల్యాలను అధికమిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. స్టెప్ అధికారి ఎస్ఏ.బాబు మాట్లాడుతూ కష్టపడే తత్వాన్ని ఇప్పటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. అలాగే ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని ఆయన చెప్పారు.

నంది అవార్డు గ్రహీతకు సత్కారం

చోడవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సినీ కథా రచయిత, నంది అవార్డు గ్రహీత చింతకింది శ్రీనివాసరావును వెంకన్నపాలెంలో ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరావు 1979-81లో పదో తరగతి చదువుకున్నారు. ఆ బ్యాచ్ విద్యార్థులంతా వెంకన్నపాలెంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనుష్క ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న ఘాటి సినిమాకు కథ అందిస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహార కల్తీ జిల్లా నియంత్రణ అధికారి నందాజీ, రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, కృష్ణవేణి, హసీనా, హారిక రామకృష్ణ, గుప్తా, ఓ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల ఎగవేత ఫిర్యాదుపై విచారణ

గొలుగొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్లపాలెం గ్రామంలో పింఛన్ల లబ్ధిదారులతో ఎస్ఐ రామారావు సోమవారం విచారణ చేపట్టారు. ఈ నెలలో పది మందికి వేలుముద్రలు తీసుకుని నగదు పంపిణీ చేయకపోవడంపై పోలీసులకు జోగంపేట కార్యదర్శి సింహాద్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో లబ్ధిదారులతో ఎస్ఐ విచారణ చేపట్టారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శేఖర్ వేలిముద్రలు సేకరించి నగదు అందించలేదని లబ్ధిదారులు ఎస్ఐకు తెలిపారు. దీనిపై క్రిమినల్, లబ్ధిదారులను మోసగించినట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో నేరాలు కట్టడి

» గతంతో పోలిస్తే ఆరు నెలల్లో 16 శాతానికిపైగా తగ్గుముఖం

» ఎస్పీ తుహిన్ సిన్హా



మునగపాక పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా

మునగపాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గడచిన ఆరు నెలల్లో జిల్లా నేరాలు తగ్గాయని, అంతకు ముందుతో పోలిస్తే 16 శాతానికిపైగా తగ్గు ముఖం పట్టాయని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్య, భారీ వాహనాల రాకపోకలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పరిమితికి మించి సరకు రవాణా చేసే వాహనాలపై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్.ఐ పి.ప్రసాదరావు ఉన్నారు.

దిల్ రాజు ప్రొడక్షన్స్‌లో త్వరలో సినిమా: పరశురామ్



దర్శకుడు పరశురామ్

కోటవురట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌లో దిల్ రాజు నిర్మాణ సారథ్యంలో తన దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని ప్రముఖ దర్శకుడు పరశురామ్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని జల్లూరులో ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సినిమాకు సంబంధించి కథ పూర్తయ్యిందని, త్వరలో హీరో, హీరోయిన్, ఇతర నటీనటుల ఎంపిక మొదలవుతుందని వెల్లడించారు. తాను ఇప్పటి వరకు ఎనిమిది సినిమాలకు దర్శకత్వం వహించానని, దిల్ రాజుతో చేయబోయే సినిమా తొమ్మిదోది అవుతుందన్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్, జూలై నెలల్లో ప్రారంభించే అవకాశాలు వున్నట్టు పరశురామ్ చెప్పారు.

దుర్గాలమ్మ ఆలయానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న దృశ్యం

చోడవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీలో సోమవారం దుర్గాలమ్మ ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రూ.15 లక్షల గ్రామస్థుల ఆర్థిక సాయంతో చేపడుతున్న ఈ ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, మాజీ ఎంపీపీ బుద్ధ జగ్గారావు, శరగడడం కృష్ణారావు, మల్ల కోటి జగ్గారావు, బొడ్డేడ రాజుబాబు, దాడి భూలోకనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొడ్డేడ సూర్యనారాయణ, బొడ్డేడ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగహన



మానవహారంగా ఏర్పడి క్యాన్సర్‌పై నినాదాలు చేస్తున్న దృశ్యం

నాతవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్యాన్సర్‌పై సోమవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. నాతవరంలో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద ముందుగా మహిళలు మానవహారంగా ఏర్పడి క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నినాదాలు చేశారు. రొమ్ము, గర్భసాయ, నోటి క్యాన్సర్ లక్షణాలు, నివారణ చర్యలపై వారు నినదించారు. అలాగే క్యాన్సర్ రాకుండా ఏడాదికోకసారి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. చర్మంపై పుండ్లు, కణితులు ఉండే వెంటనే ఆసుపత్రులకు వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కనకరాజు, సీసీలు తల్లిబాబు, గోవిందు యర్రయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడివిరాజులుబాబు పండుగ



స్వామివారి ప్రసాదాలతో ర్యాలీగా వెళ్లున్న భక్తులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకయ్యపాలెం, జి.కోడూరు, సుబద్రయ్యపాలెం గ్రామాల్లో అడివిరాజులుబాబు పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం భక్తులు పండ్లు తీసుకొని గ్రామాలకు దూరంగా కొండ ప్రాంతాల్లో ఉన్న అడివిరాజులుబాబు విగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి

-కొంకి అప్పారావు, ఎంపీడీవో



మండలంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని క్షేత్ర స్థాయిలోనే పరిష్కరంచడానికి కృషి చేస్తున్నాం. డిజిటల్ అసిస్టెంట్లు లేని సచివాలయాల్లో మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శి ద్వారా పనులు చేయిస్తున్నాం. సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు అవసరమైన గ్రామాలను గుర్తించి సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: మండల అభివృద్ధికి ఏ ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు?

జవాబు: సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు అవసరమైన గ్రామాలను అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా గుర్తిస్తున్నాం. సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో సర్వసభ్య సమావేశంలో సభ్యులతో చర్చించి, వారి సమ్మతి మేరకు ఆయా పనులు చేపడుతున్నాం.

ప్ర: గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉందా?

జ: మండలంలోని 23 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతీ సచివాలయానికి 11 మంది చొప్పున 253 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 176 మంది ఉన్నారు.

ప్ర: ఏ శాఖ ఉద్యోగులు తక్కువగా ఉన్నారు? వారి విధులను ఎవరితో చేయిస్తున్నారు?

జ: ప్రధానంగా డిజిటల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడంతో కొరత ఏర్పడింది. డిజిటల్ అసిస్టెంట్ లేని సచివాలయంలో, అక్కడి మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శి ద్వారా పనులు చేయిస్తున్నాం.

ప్ర: పారిశుధ్యం మెరుగుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: అన్ని పంచాయతీల కార్యదర్శులకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని ఆదేశించాం. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రతీ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో పారిశుధ్యంపై విజిట్ చేసి తగిన సూచనలు ఇస్తున్నాం.

ప్ర: సమస్యలపై ప్రజల ఫిర్యాదు చేస్తే ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ: పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటాం. వారి స్థాయిలో పరిష్కారం కాకపోతే క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

-మాడుగుల రూరల్, ఆంధ్రజ్యోతి

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు సహకరించండి

» బోరు మెకానికల్ వినతి

చోడవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల క్రమబద్ధీకరణకు సహకారం అందించాలని బోరు మెకానిక్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజుకు వినతిపత్రం అందించారు. చాలా ఏళ్లుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్నామని, ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. తమ సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

క్వారీ లారీలతో రోడ్లు ధ్వంసం

రోలుగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజన్నపేట క్వారీ నుంచి బుచ్చెంపేట, కొవ్వూరు, గొల్లపేట గ్రామాల మీదుగా వెళ్తున్న క్వారీ లారీలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. శరభవరం పంచాయతీ శివారున సర్వే నెం 216లో నిబంధలకు విరుద్ధంగా క్వారీకి అనుమతులు జారీ చేశారన్నారు. లారీలతో పరిమితికి మించి రాయి తరలిస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

రోలుగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయ్‌గౌరిని గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. రత్నంపేట, కొమరవోలు, రోలుగుంట, కొవ్వూరు పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి ఈ ప్రచారం చేశారు. విజయ్‌గౌరి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నారని, ఆమెను గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రాజు, నాయకుడు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికడదాం..

మాకవరపాలెం: మహా కుంభమేళాలో కాలుష్యాన్ని అరికడదామంటూ సోమవారం తూటిపాల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ సంచులు తీసుకు వెళ్లకూడదని పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నేత రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి జాతరకు పోదామా!

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని పూడిమడకలో మంగళవారం సాయంత్రం జాతర ప్రారంభం కానున్నది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం రాత్రి భక్తులు జాగారం చేస్తారు. ఈ సందర్భంగా తీరంలో పలు రకాల సాంస్కృతిక, వినోదభరిత కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం తీరంలోని ఆలయంలో లక్ష్మీ, వేణుగోపాలస్వామి, సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామిని దర్శించుకుంటారు. వాహనాల కోసం పూడిమడక శివారులోని ఉప్పు గల్లీల వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు అనకాపల్లి నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కాగా పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, మెరైన్ డీఎస్పీ సంహాద్రి నాయుడు, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీఓ ప్రభాకరరావు సోమవారం సాయంత్రం పూడిమడక తీరంలో పర్యటించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు సముద్రంలో ఎక్కువ దూరం వెళ్లకుండా నివారించేందుకు తీరంలో 30 పడవల్ని ఒకదానితో మరొకటి తాళ్లతో కట్టి ఉంచుతున్నామన్నారు. తీరంలో హై మాస్ట్ లైట్లు, మైక్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. తీరంలో 30 మంది గజఈతగాళ్లను అందుబాటులో వుంచుతామని చెప్పారు. ముగ్గురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



పూడిమడక తీరంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు



పూడిమడక తీరంలో జగన్నాథస్వామి ఆలయం

రేవుపోలవరంలో...

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరం వద్ద జరిగే జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మాఘ పౌర్ణమి నాడు ఇక్కడ సముద్రతీరంలో పుణ్యస్నానం ఆచరించడానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. అనంతరం సముద్ర తీరం పక్కనే కొండపై ఉన్న లక్ష్మీ మాధవ స్వామిని దర్శించుకుంటారు. బుధవారం మాఘ పౌర్ణమి కావడంతో ముందు రోజు రాత్రి ప్రారంభం కానున్న జాతరకు పలు ప్రాంతాల నుంచి సుమారు 70 వేల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు తాగునీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, సముద్రంలో స్నానం చేసిన తరువాత మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలను రేవుపోలవరానికి సమారు కిలో మీటరు దూరంలోనే నిలుపుదల చేస్తారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కాగా రేవుపోలవరం జాతర సందర్భంగా నలుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 210 మంది పోలీసులతో భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు నక్కపల్లి సీఐ రామకృష్ణ తెలిపారు. సముద్ర తీరంలో గజ ఈతగాళ్లను అందుబాటులో వుంచుతున్నామన్నారు. భక్తులకు తాగునీటి కోసం 400 బస్తాల వాటర్‌ప్యాకెట్లను సిద్ధం చేసినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్ చెప్పారు.



రేవుపోలవరం సముద్రతీరం కొండపైన ఆలయంలో లక్ష్మీ మాధవస్వామి

పూడిమడక, రేవుపోలవరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్/ నర్సీపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా అచ్యుతాపురం మండలం పూడిమడక, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు పీటీడీ డీపీటీవో కె.పద్మావతి చెప్పారు. అనకాపల్లి డిపో నుంచి 35 బస్సులను పూడిమడకకు నడుపుతామని, మంగళవారం సాయంత్రం ఐదు బస్సులతో ప్రత్యేక సర్వీసులను ప్రారంభిస్తామని, 12వ తేదీ తెల్లవారుజామున మూడు గంటల నుంచి 30 బస్సులను నడుపుతామని వెల్లడించారు. రేవుపోలవరం వద్ద సముద్ర స్నానాలకు వెళ్లే భక్తుల కోసం 11వ తేదీ సాయంత్రం నుంచి 12వ తేదీ సాయంత్రం వరకు నర్సీపట్నం డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతామని డిపోమేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ తెలిపారు. నర్సీపట్నం- అడ్డరోడ్డు మధ్య 15 బస్సులు, అడ్డరోడ్డు- రేవుపోలవరం మధ్య 15 బస్సులు, క్రిరివానిపాలెం నుంచి అడ్డరోడ్డుకి నాలుగు, రాంబిల్లి మండలం కె.వెంకటాపురం నుంచి రేవుపోలవరానికి ఒక బస్సు నడుపుతామని ఆయన పేర్కొన్నారు.

ఎలమంచిలిలో వైభవ్ జ్యూవెలర్స్ షోరూమ్ ప్రారంభం

ఎలమంచిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట మెయిన్ రోడ్డులో వైభవ్ జ్యూవెలర్స్ ఏర్పాటు చేసిన షోరూమ్‌ను సోమవారం మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన ఆభరణాలను ఎలమంచిలి, చుట్టుపక్కల ప్రాంతాల వారికి అందుబాటులో వుంచడానికి ఇక్కడ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వైభవ్ సంస్థల సీఎండీ గ్రంధి భారత మల్లికా రత్నకుమారి మాట్లాడు తూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 17 షోరూమ్ లను ఏర్పాటు చేశామని, ఎలమంచిలలో ప్రారంభించినది 18వ షోరూమ్ అని వెల్లడించారు. ఉత్తమ నాణ్యత, అం దుబాటు ధరలతో, విభిన్న డిజైన్‌లలో బంగారం, వజ్రాలు, రత్నాలతో కూడిన ఆభరణాలు, వెండి వస్తు వులు, పూజాసామగ్రి తమ షోరూమ్‌లలో కస్టమర్లకు అందుబాటులో వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైభవ్ జ్యూవెలర్స్ హోల్‌టైమ్ డైరెక్టర్ గ్రంధి సాయికీర్తన, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాథ్, సీఓఓ గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



వైభవ్ జ్యూవెలర్స్ షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి. పక్కన వైభవ్ సంస్థల సీఎండీ గ్రంధి భారత మల్లికా రత్నకుమారి. (ఇన్‌సెట్‌లో) రమాకుమారికి మొక్కను బహూకరిస్తున్న వైభవ్ సంస్థల సీఎండీ.

రైతులకు విశిష్ట గుర్తింపు

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు.

బహుళ ప్రయోజనాలు

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను ఈ యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. ఈ కోడ్ నంబర్‌ను యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేస్డ్ ఆథంటికేషన్, పీఎం కిసాన్, తదితర వాటికి అనుసంధానిస్తారు. ఈ ఐడీ నంబరును ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింకుతో కూడిన సేవలను పొందవచ్చును. దీని సాయంతో దేశంలో ఎక్కడైనా రుణ అర్హత, రుణ బకాయిలు ఇతర సంక్షేమ పథకాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. వ్యసాయ రంగంలో అన్ని సంక్షేమ పథకాలకు దీనిని తప్పనిసరి చేయనున్నారు. పండించిన పంటలకు మద్దతు ధర పొందేందుకు, మార్కెట్‌లో సులువుగా విక్రయించుకునేందుకు ఉపయోగపడుతుంది. ఎరువుల సరఫరా, లభ్యత, పంట రుణాల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం అందుతుంది.

నమోదు విధానం

రైతులు తమ ఆధార్ నంబరు, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలి. రైతుల ఎదుటే ఆయా వివరాలను సిబ్బంది అప్‌లోడ్ చేస్తారు. రైతుల ఆధార్ నంబర్‌కు అనుసంధానమైన ఫోన్‌కు వచ్చే ఓటీపీ నంబరు చెబితే నమోదు చేస్తారు. లేదా బయోమెట్రిక్ విధానం ద్వారా కూడా నమోదు చేస్తారు. స్థానికంగా లేని రైతులు తమ గ్రామంలోని ఆర్‌ఎస్‌కే సిబ్బందిని ఫోన్‌లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవచ్చు.

ఈ నెల 25వ తేదీ వరకే గడువు

ఎస్.విజయలక్ష్మి, ఏఓ, రోలుగుంట



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ సంబంధ పథకాలను అర్హులైన రైతులకు మాత్రమే చేరేలా కొత్తగా భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీని అందుబాటులోకి తీసుకువచ్చాయి. భూ ఆధార్ ఉన్న వాళ్లకే పీఎం కిసాన్, తదితర పథకాలు వర్తిస్తాయి. అన్ని పత్రాలతో సమీప రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలి.

జి.కోడూరు సర్పంచ్ సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

చేసినట్టు రికార్డుల్లో నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. దీంతో మాకవరపాలెం ఎంపీడీవో, సబ్బవరం ఈవోపీఆర్‌డీ విచారణ చేశారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు రుజువు కావడంతో సర్పంచ్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేశారు.

త్రిశంకు స్వర్గంలో గోవాడ

... 5వ పేజీ తరువాయి

గోవాడకు ఈ దుస్థితి ఏర్పడేది కాదన్న భావన ఇటు రైతుల్లో, అటు కార్మికుల్లో వ్యక్తమవుతున్నది.

సకాలంలో చెరకు క్రషింగ్ చేస్తే చాలు

- అద్దేపల్లి నూకరాజు, చుక్కపల్లి



ఫ్యాక్టరీకి తెచ్చిన చెరకును వెంటనే గానుగాడిస్తే బాగుంటుంది. కానీ కాటా వద్దకు తీసుకువచ్చిన చెరకు వారం రోజులు అవుతున్నా క్రషింగ్‌కు వెళ్లడంలేదు. సరఫరా చేసిన చెరకుకు డబ్బులు ఇప్పుడు అడగడం లేదు. తెచ్చిన చెరకును సత్వరమే క్రషింగ్ చేయాలని కోరుతున్నాం. చెరకు ట్రాక్టర్ ఒక రోజు ఆగితే రూ.600 అద్దె, డ్రైవర్‌కు రూ.600 బేటా ఇవ్వాలి. ఎన్ని రోజులు ఆగితే అన్ని రూ.1,200 చెల్లించుకోవాల్సిందే.

సొంతింటి కల నెరవేర్చేలా సర్కార్ అడుగులు!

... 5వ పేజీ తరువాయి

తొలిదశలో తొమ్మిది వేల ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 6,121 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో వున్నట్టు గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో 4,106 ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో వున్నాయి. బీబీఎల్ దశలో 16, బేస్‌మెంట్ స్థాయిలో 195, రూఫ్‌స్థాయిలో 761, రూఫ్‌కాస్ట్ దశలో 1,043 ఉన్నాయి. తొలిదశ పనులు త్వరగా పూర్తి చేసి, రెండో దశలో మరికొన్ని ఇళ్ల నిర్మాణాలను చేపడతామని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగం

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల ముందు చేసిన పనులకు సంబంధించి రూ.2,93,000 డ్రా చేసినట్టు గుర్తించారు. దీంతో శ్లాబ్ నిర్మాణానికి అయిన ఖర్చుపోను మిగిలిన రూ.1,51,181లు సర్పంచ్ భర్త రామకృష్ణ నుంచి రికవరీ చేసి ఈ నెలాఖరులోగా గ్రామపంచాయతీ ఖాతాకు జమ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ విచారణలో కార్యదర్శులు రఘు, రమణ, సర్పంచ్ విజయలక్ష్మి, ఫిర్యాదుదారులైన ఉపసర్పంచ్ మాకిరెడ్డి వరహాలు, టీడీపీ నాయకుడు కొండలరావు పాల్గొన్నారు.

క్రైం... crime news

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి



పవన్‌తేజ (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్రతీరంలో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మొక్క పవన్‌తేజ (17) మృతదేహం సోమవారం రామకొండ వద్ద లభ్యమైందని సీఐ నరసింగరావు తెలిపారు. విశాఖలో స్థిరపడిన మండలంలోని కొత్తపేటకు చెందిన మొక్క శ్రీధర్, మొక్క మల్లికార్జునరావుల కుమారులు సూర్యతేజ, పవన్‌తేజ ఈ నెల 9న స్వగ్రామంలో పూజా కార్యక్రమాలకు వచ్చారు. వీరితోపాటు మరికొంత మంది వాడపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. వీరిలో నలుగురు వ్యక్తులు సముద్ర తీరంలో స్నానాలు చేస్తుండగా బలమైన కెరటం వచ్చి లోపలికి లాగేసింది. ఆ సమయంలో తీరం వద్ద ఉన్న మెరైన్ పోలీసులు, మత్స్యకారులు వెంటనే ముగ్గురిని ఒడ్డుకు చేర్చారు. వీరిలో సూర్యతేజ మృతిచెందాడు. పవన్‌తేజ గల్లంతయ్యాడు. సోమవారం వాడపాలెం సమీపంలోని రామకొండ తీరం వద్దకు పవన్‌తేజ మృతదేహం చేరుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వంటాకుల గంగాధర్ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పట్టణ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకవరపాలెం మండలం చంద్రయ్యపాలెం గ్రామానికి చెందిన వంటాకుల గంగాధర్(28) టీ దుకాణం నిర్వహిస్తు న్నాడు. ఆదివారం రాత్రి 8 గంటలకు ద్విచక్ర వాహనంపై చెట్టుపల్లి గౌరీపరమేశ్వరుల తీర్థ మహోత్సవానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో స్వగ్రామానికి అతివేగంగా వస్తూ పొగమంచు వల్ల రోడ్డు సరిగ్గా కనిపించక సుబ్బారాయుడుపాలెం సమీపంలో చెట్టును ఢీకొని పడిపోయాడు. అతనిని ఏరియా ఆస్పత్రికి తరలించగా తలకు బలమైన గాయమై మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని సీఐ తెలిపారు. గంగాధర్‌కు వివాహం కాలేదు. అతనికి తండ్రి, తల్లి, అన్నయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతుడి గుర్తింపు



వారధి అశ్విన్ (ఫైల్ ఫొటో)

కొత్తూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిసినికాడ వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన యువకుడు పట్టణంలోని కాండ్రేగుల రామునాయుడు కాలనీకి చెందిన వారధి అశ్విన్‌కుమార్ (21)గా గుర్తించినట్టు అనకాపల్లి రూరల్ ఏఎస్‌ఐ జె.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అశ్విన్‌కుమార్ తన స్నేహితుడు కుంబా హర్షవర్ధన్‌తో కలిసి ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై బయ్యవరం వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిసిన తరువాత రాత్రి 11 గంటల సమయంలో అనకాపల్లికి తిరిగి బయలుదేరారు. పిసినికాడ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొని, ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అశ్విన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సమాచారం అందుకున్న తల్లి రామలక్ష్మి వచ్చి.. చేతికి అందివచ్చిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ చెప్పారు.

హోంగార్డు ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక హోంగార్డు అట్టా ఝాన్సీ కుమారుడితో సహా ఆత్మహత్య చేసుకున్న కేసుకు సంబంధించి భర్త అట్టా అచ్యుతరావును సోమవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న ఝాన్సీ కశింకోటలో నివాసం వుంటున్నది. కొంతకాలం నుంచి భర్త వేధిస్తుండడంతో భరించలేక శుక్రవారం సాయంత్రం కుమారుడు దినేష్‌కార్తీక్‌తో కలిసి తుమ్మపాల వద్ద గల ఏలేరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఆమె భర్త అచ్యుతరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469